ప్రజాశక్తి

ఆదివారం 13 ఆగష్టు 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పాత పెన్షన్ విధానాన్ని

పునరుద్ధరించాలి

- విద్యా శాఖను నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలి
- ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి మంజుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద సామూహిక నిరసన విజయవంతం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. విద్యా శాఖను నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలని ఆమె కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద 12 గంటల సామూహిక నిరసన జరిగింది. కార్యక్రమానికి ఫ్యాప్టో ప్రకాశం జిల్లా ఛైర్మన్ డి.శ్రీనివాసులు అధ్యక్షత వహించి సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. అనేక యాప్‌లు ▶ 2లో

మళ్లీ సర్దు'పోటు'!

సామాన్యులపై

విద్యుత్తు బిల్లుల భారం





మార్కాపురంలో ఓ ఇంటికి అధికంగా వచ్చిన బిల్లు



యర్రగొండపాలెంలో ఓ ఇంటికి అధికంగా వచ్చిన బిల్లు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

వినియోగదారులపై విద్యుత్తు ఛార్జీల భారం పెరుగుతూనే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయంలో వివిధ రూపాల్లో పలుమార్లు విద్యుత్తు ఛార్జీలు పెరిగాయి. తాజాగా 2021-22, 23 సంవత్సరాల్లో కొనుగోలు చేసిన విద్యుత్తుకు సంబంధించిన సర్దుబాటు రుసుములను కలిపి ఆగష్టు బిల్లులను ఇస్తున్నారు. వీటిని చూసి వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.

అదనపు భారమే..

మార్కాపురం నియోజకవర్గ పరిధిలో మార్కాపురం పట్టణం, మార్కాపురం గ్రామీణం, తర్లుపాడు మండలాల్లో అన్ని సర్వీసులు కలిపి 65 వేల వరకు విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. యర్రగొండపాలెం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో 29,379 సర్వీసులు, పుల్లల చెరువు మండలంలో 25,012 సర్వీసులు, త్రిపురాంతకం మండలంలో 29,673 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. మూడు మండలాల పరిధిలో మొత్తం కలిపి 84, 064 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. సర్దుబాటు రుసుంతో ప్రతి కనెక్షన్‌పై సుమారు రూ.50 నుంచి రూ.500 వరకూ అదనపు భారం పడనుంది. ప్రస్తుత ఆగస్టు నెలకు సంబంధించిన బిల్లులో ట్రూ అప్ ఛార్జీలతో పాటు ఎఫ్‌పిపి సిఎ1, ఎఫ్‌పిపిసిఎ 2 పేరిట సర్దుబాటు రుసుం విధిస్తున్నారు. 2021-22 లోనూ ▶ 2లో

ఏసీబీకి పట్టుబడ్డ విద్యుత్ ఏడీఈ



ఏఈడీ శ్యామ్‌సుధాకర్

రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల , చెరుకుపల్లి

రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖ ఏడీఈని ఏసీబీ అధికారులు పట్టుకున్న ఘటన చెరుకుపల్లిలో శనివారం జరిగింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం, నగరం మండలాలకు ఏడీఈగా వ్యవహరిస్తున్న శ్యామ్ సుధాకర్‌బాబు పిట్టలవాని పాలెం మండలం, చందోలు గ్రామానికి చెందిన ఒక ఐస్ కంపెనీకి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేం దుకు ఐస్ ఫ్యాక్టరీ యజమాని వద్ద నుండి రూ.లక్షా 15 వేలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం రూ.70 వేలు ఏడీఈ లంచం తీసుకుంటుండగా గుంటూరు ఏసీబీ అధికారులు దాడి చేసి.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విద్యుత్ ఏడీఈ సుధాకర్‌పై కేసు నమోదు చేసి.. విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఎస్పీని కలిసి అంతా వివరించా..

ఆమంచి కృష్ణమోహన్ ▲ 4లో

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని..

ఆమంచి స్వాములుపై కేసు నమోదు



ఆమంచి స్వాములు

ప్రజాశక్తి-వేటపాలెం

సోషల్ మీడియాలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాద్ రావు తెలిపారు. శనివారం ఆయన ఆమంచి శ్రీనివాస రావు/స్వాములు సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు మీడియాకు తెలిపారు. చీరాల నియోజకవర్గం, వేటపాలెం మండల పరిధిలో గల రామన్నపేట గ్రామ పంచాయతీ 6, 10 వార్డు సభ్యుల ఉపఎన్నికల నామినేషన్ వేసే విషయంపై పర్చూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కష్ణమోహన్ గ్రూపు, చీరాల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు గ్రూపు మధ్య జరిగిన ఘర్షణ విషయంలో పోలీసు వారు వెంటనే స్పందించి, గుంపును చెదరగొట్టారని తెలిపారు. అక్కడి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకొని, చట్టపరమైన చర్యలు చేపట్టి, ప్రశాంత వాతావరణం నెలకొల్పారని పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండలం, పందిళ్లపల్లి గ్రామంలో జనసేన నాయకుడు ఆమంచి శ్రీనివాస రావు/స్వాములు ప్రెస్‌మీట్ పెట్టారు. ప్రెస్ మీట్‌లో చీరాల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబును పరుష పదజాలంతో దూషిస్తూ.. ఆ దూషణలను తన ఇంటి వద్ద నుండి సోషల్ మీడియా వాట్సప్ గ్రూప్‌ల ద్వారా పంపి, వివిధ సమూహాల మధ్య శతత్వం కలిగించే విధంగా, ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా మాట్లాడినట్లు తెలిపారు. అతని చర్యల వల్ల చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిందన్నారు. ఆమంచి శ్రీనివాసరావు/స్వాములు సోషల్ మీడియాలో మాట్లాడిన మాటలు రెచ్చగొట్టే విధంగా ఉండటంతో అతనిపై చట్టపరంగా వేటపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విధంగా ఎవరైనా ప్రజల మధ్య గొడవలు జరిగే విధంగా మాట్లాడినా, లేదా సోషల్ మీడియా మరియు వాట్సప్‌ల ద్వారా రెచ్చగొట్టే మాటలు మాట్లాడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

- కాపాడుకొనేందుకు మేధావులు కలిసికట్టుగా పనిచేయాలి
- బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-కనిగిరి, పిసిపల్లి

భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దానిని కాపాడుకునేందుకు శాస్త్రవేత్తలు, మేధావులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా జనవిజ్ఞానవేదిక 17వ మహాసభల సందర్భంగా శనివారం సాయంత్రం కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ ఆవరణలో జెవివి జిల్లా నాయకులు జెడ్. రమణయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ దక్పథానికి ఒక సాధికారతను రాజ్యాంగం కల్పించిందన్నారు. ఇలాంటి రాజ్యాంగం ప్రస్తుతం ప్రమాదంలో ఉందని తెలిపారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక ప్రచారం చేస్తోందన్నారు. ఏ విషయాన్ని అయినా సైన్సు ఆధారంగానే జనవిజ్ఞానవేదిక ప్రచారం చేస్తోందన్నారు. సామాజిక సంస్కరణ ఉద్యమాలలో కూడా జెవివి కృషి చేస్తోందని తెలిపారు. సైన్స్ ప్రచారం కోసం మూఢనమ్మకాలకు ▶ 2లో

మళ్లీ సర్దు 'పోటు'.!

(మొదటిపేజీ తరువాయి)

2014-19 మధ్య ఉన్న పరిస్థితే ఉందని.. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తాన్ని వసూలు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ దఫా ఏప్రిల్-జూన్ వరకు ఒక్కో యూనిట్‌కు 20 పైసలు, జులై నుంచి సెప్టెంబరు వరకు 63 పైసలు, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 58 పైసలు, 2024 జనవరి నుంచి మార్చి వరకు ఒక్కో యూనిట్‌పై ట్రూ అప్ పేరిట 67 పైసలు అదనపు భారం వినియోగదారులు భరించాల్సిందే..

గతంలో రూ.500 లోపే..

పాముల పాలు రాజు, గజ్జలకొండ, మార్కాపురం

గతంలో నా ఇంటికి నెలకు రూ.500 లోపే విద్యుత్తు బిల్లు వచ్చేది గత కొన్నేళ్లుగా విద్యుత్తు బిల్లులను ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి పెంచుతూనే ఉన్నారు. ఆగష్టులో బిల్లు ట్రూఅప్. సర్దుబాటు రుసుములు కలిసి రూ.1382 వచ్చింది.

రెట్టింపు బిల్లు వస్తోంది..

తాటి నాగేశ్వరరావు, వేగినాటి కోటయ్య నగర్, యర్రగొండపాలెం

గతంలో నెలకు రూ.120 లోపే విద్యుత్తు బిల్లు వచ్చేది. గత కొన్నేళ్లుగా విద్యుత్తు ఛార్జీలు ప్రతి మూడు, నాలుగు నెలలకు ఓ సారి పెంచుతూ రావడంతో ఆగస్టు బిల్లు రూ.7,893 వచ్చింది. విద్యుత్ బిల్లులు భారంగా మారుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కిరోసిన్ దీపాలు పెట్టుకోక తప్పేలా లేదు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పెట్టి ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని మోపుతుందన్నారు. తద్వారా ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడిలో పనిచేస్తున్నారన్నారు. సిపిఎస్‌ను అధికారంలోకి వచ్చిన వారం రోజులలో రద్దు చేస్తామని చెప్పిన సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ మాట తప్పారన్నారు. జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, పి.రఘుబాబు, పివి సుబ్బారావు, వై.శ్రీనివాసరావు, ఎర్రయ్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ నిరంకుశ విధానాన్ని విడనాలని డిమాండ్ చేశారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. పాత పింఛన్ విధానిన్న పునరుద్ధరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కో ఛైర్మన్లు ఎస్.రవి, దాసరి శ్రీను, బి.అశోక్ కుమార్, వై.వెంకట్రావు, డి.వీరాంజనేయులు, జి.ఉమా మహేశ్వరి, బషీరున్నీసా, సువర్ణ బాబు, బి.శేషారావు, పి.హనుమంతరావు, జెవిఆర్, అబ్దుల్ హై, శంకర్, పి.ఆదినారాయణ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టయోటా రుమియన్ వాహనం ఆవిష్కరణ

- కెంఎంటి వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దేశీయ విపణిలోకి సరికొత్త బహుళ వినియోగ వాహనం (ఎంపివి) రుమియన్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా టికెఎం వైస్ ప్రెసిడెంట్ (విక్రయాలు, వ్యూహాత్మక మార్కెటింగ్) అతుల్ సూద్ తెలిపారు. ఇప్పటికే ఈ విభాగంలో కంపెనీకి 30 శాతానికి పైగా వాటా ఉందన్నారు. కొత్త వాహనం 7 సీట్లు, 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమాటిక్ ట్రాన్స్‌మిషన్‌లో వస్తోందన్నారు. సిఎన్‌జి వేరియంట్ కూడా లభ్యమవుతోంది. వాహన ధర, బుకింగ్ తేదీలను త్వరలో ప్రకటిస్తామని కంపెనీ తెలిపింది. పెట్రోల్‌పై లీటరుకు 20.51 కిలోమీటర్లు, సిఎన్‌జిలో కిలోమీటర్‌కు 26.11 కి.మీ చొప్పున మైలేజీ వస్తుందని ఆయన వివరించిండి. రాబోయే పండుగ సీజన్ లో ఈ మోడల్ మార్కెట్లోకి తీసుకొస్తామని అతుల్ సూద్ తెలిపారు. టయోటా, సుజుకీ మధ్య కుదిరిన అంతర్జాతీయ సహకార ఒప్పందంలో రుమియన్‌ను మారుతీ సుజుకీ ఉత్పత్తి చేసి టిఎంకెకు సరఫరా చేస్తుందని ఆయన తెలియజేశారు.

ఐసిఎంఆర్ ఖాళీల భర్తీపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) కు గత మూడు సంవత్సరాలలో మంజూరుచేసిన పోస్టులు, వాటి సత్వర నియామక చర్యల పై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయక మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పి సింగ్ బఘెల్ సమాధానమిస్తూ గత మూడు సంవత్సరాలలో శాస్త్రీయ కేడర్ 876 పోస్టులు, సాంకేతిక కేడర్ 2,811 పోస్టులు, పరిపాలన కేడర్ 1,580 పోస్టులు మంజూరుకాగా, 2023 నాటికి వరుసగా 142, 1230 మరియు 799 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. శాస్త్రీయ కేడర్ 41 పోస్టులకు, సాంకేతిక కేడర్ 983 పోస్టులకు సంబంధించి నియామకాల ప్రక్రియ ఈ సంవత్సరంలో జరుగుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరం లో ఒక క్రమ పద్ధతితో నియామకాల ప్రక్రియ చురుకుగా జరుగుతుందని, అనేక స్థానాలలోని పరిపాలన కేడర్ పోస్టులు పునరుద్ధరించబడ్డాయని కేంద్ర మంత్రి తెలియజేశారు

ప్రమాదంలో భారత రాజ్యాంగం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా పనిచేసే సంస్థల్లో జనవిజ్ఞానవేదిక అగ్రగామిగా ఉందని తెలిపారు. కావున ఉపాధ్యాయులు, మేధావులు, శాస్త్రవేత్తలు జనవిజ్ఞానవేదికను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ కూడా ప్రసంగించారు. సభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే కాజా హుస్సేన్, అజయ్ ప్రకాశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న మహిళలు

జాతీయ జెండాలతో ర్యాలీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

హర్ గర్ తీరంగా, నా భూమి నా దేశం, నా నేల కార్యక్రమంలో భాగంగా శనివారం పుల్లలచెరువు మండలం చాపలమడుగు పంచాయతీలో రైతు భరోసా కేంద్రం దగ్గర డిఆర్ డీఏ వైఎస్ఆర్‌కెపి ఏపియం నూనె వెంకటయ్య ఆధ్వర్యంలో డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె వెంకటయ్య మాట్లాడుతూ భారత దేశాన్ని భారతీయులే పరిపాలించుకోవాలనే నినాదంతో ఐక్యత సమగ్రత కలిగి మన పూర్వీకులను గుర్తు చేసుకుంటూ ఈ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివోఎలు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆర్యవైశ్య ఉపాధ్యక్షులుగా 'చాటకొండ'

ప్రజాశక్తి-మార్కాపురం

అంతర్జాతీయ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి చాటకొండ నాగరాజు నియమితులయ్యారు. మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి చాటకొండ నాగరాజు నియమితులు కావడం విశేషం. ఈ మేరకు అంతర్జాతీయ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ నుండి శనివారం అధికారికంగా ఉత్తర్వులు అందాయి. నాగరాజు ప్రస్తుతం ఆర్యవైశ్య యువజన సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నాగరాజు స్వర్గీయ చాటకొండ రామయ్యకు రెండవ కుమారుడు కాగా... మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణకు స్వయానా బావ మరిది. చాటకొండ నాగరాజు తండ్రి రామయ్య గతంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్‌గా సమర్థవంతంగా పని చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అత్యంత కీలకమైన అంతర్జాతీయ ఆర్యవైశ్య మహాసభకు ఉపాధ్యక్షులుగా నియమించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. నాగరాజు నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

అమ్మకానికి పొగాకు బేళ్లు 1814

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రంలో శనివారం నాడు అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు 1814 ఉన్నాయని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కొడిపాలెం, తాటాకులపాలెం, పోలిరెడ్డిపాలెం, సతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 1814 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 1729 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 85 బేళ్లు వివిధ కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.273, అత్యల్ప ధర కిలో రూ.150, సరాసరి ధర కిలో రూ.259.68 పలికిందన్నారు.

వసుధకు వందనం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని ముప్పవరంలో గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసుధకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని మిట్టపాలెం, ముప్పవరం, చినవెంకన్నపాలెం గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మన భూమి నా దేశం కార్యక్రమములో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా యంపిడివో రమణమూర్తి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యము నివారించడంతో పాటు వాతావరణ సమతుల్యంగా ఉండేందుకు మొక్కలు దోహదపడతాయని అన్నారు. అనంతరం మొక్కలను నాటి, శిలాఫలకాలను ఏర్పాటు చేసి భూమికి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల సులోచన, రాష్ట్ర బిసిసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి బత్తుల నారాయణ స్వామి, ఏపివో మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, వాలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

24న ఒంగోలు జాతి పశువుల వేలం పాట

నాగులుప్పలపాడు : మండలంలోని చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రంలో ఒంగోలు జాతి పశువుల వేలం పాట ఈనెల 24 వతేది ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం డిడి బి రవి తెలిపారు ఒంగోలుజాతి పాడిఆవులు 20,ఒట్టిఆవులు 30,పెయ్యలు 4,పెయ్యదూడలు 20,కోడెదూడలు 7,మొత్తం 81పశువులకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు వేలంపాటలో పాల్గొనదలచిన వారు 5వేల రూపాయలు దరావత్తు చెల్లించాలన్నారు 23వ తేది సాయంత్రం 5గంటలవరకు పశువులను పరిశీలించవచ్చు అన్నారు పాటలో పాల్గొను వారు ఆదార్ కార్డు పొలం పట్టాదారు పాసుపుస్తకం తెచ్చుకోవాలన్నారు ప్రక్కన ఒక్కరికి మాత్రమే అనుమతించ బడునన్నారు ప్రతి ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు పాట నిలుపుదల చేయుటకు గాని తేదిని మార్చుటకు గాని పశువుల సంఖ్య మార్చుటకు కమిటి వారికి పూర్తి అధికారం ఉందన్నారు.

టిటిడి కల్యాణ మండప నిర్మాణం ఎప్పుడో?

దాతల ద్వారా రూ.50 లక్షలు డిపాజిట్ చేసినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని పాత శింగరాయకొండ గ్రామ పంచాయతీలో ఉన్న దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దగ్గర టిటిడి కళ్యాణ మండపం నిర్మాణం చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగిలేలా ఉన్నాయి. టిటిడి చైర్మన్‌గా వైవి.సుబ్బారెడ్డి ఉన్న సమయంలో పాత శింగరాయకొండ దేవస్థానం వద్ద టిటిడి కల్యాణ మండపం నిర్మాణం చేయాలని సూచించడంతో వైవి.సుబ్బారెడ్డి దానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. టిటిడి కళ్యాణ మండపం నిర్మిస్తున్నామంటూ.. వైసీపీ నాయకులు ఊరు మీద పడి.. దాతల ద్వారా రూ.50 లక్షలు వసూలు చేసి.. తిరుమల తిరుపతి దేవస్థానంలో డిపాజిట్ చేశారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి కళ్యాణ మండపం కోసం ఇచ్చిన నిధులు సైతం వెనక్కి పంపించిన చరిత్ర కూడా ఇక్కడ ఉంది. టిటిడి కళ్యాణ మండపం నిర్మిస్తామని స్థానిక వైసిపి నాయకులు అందరికీ చెప్పారు. టిటిడి అధికారులు శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం వద్దకు వచ్చి స్థలం పరిశీలించుకొని వెళ్లారు. ఆ స్థలం పరిశీలన సమయంలో



వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

ఈ స్థలం చాలదని టీటీడీ అధికారులు చెప్పినప్పటికీ ఆ స్థలాన్ని సరిచేసి కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టాలని నాయకులు సూచించారు. టీటీడీ అధికారులు మాత్రం అలా సాధ్యం కాదన్నారు. టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి పదవీకాలం ముగిసిపోయింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో కట్టిన 50 లక్షల రూపాయలు అలాగే నిలిచిపోయాయి. టిటిడి కళ్యాణమండపం మాత్రం అడుగు ముందుకు పడని పరిస్థితి. ఇక్కడ ఉన్న వైసిపి నాయకులు మాత్రం కళ్యాణ మండపం వస్తుందని ఇస్తున్న బిల్డప్పులు అంతా ఇంతా కాదు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సన్నిధి రాజారావు, హేమ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని దోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ట్రస్టు సేవలను కొనియాడారు. అనంతరం నంద్యాలకు చెందిన శాంతిరామ్ మెడికల్ కాలేజి, జనరల్ ఆసుపత్రి వైద్య నిపుణులు పాల్గొని 350 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ సన్నిధి కిశోర్ కుమార్ మాట్లాడుతూ అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిధి రాజారావు, హేమ, వైసిపి నాయకులు గుమ్మా యల్లేష్ యాదవ్, వైస్ ఎంపిపి దర్శనం నాగయ్య, వెన్నా కాశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, కరుణాకర్, మందగిరి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై విచారణ జరిపించాలి

- అక్రమాలకు పాల్పడిన ఎస్ఓపై చర్యలు తీసుకోవాలి
- నష్టపోయిన తనకు న్యాయం చేయాలి
- జిల్లా కలెక్టర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు కెజిబివిలో జరిగిన నాడు నేడు పనులపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన కెజిబివి పాఠశాల ఎస్ఓ లిల్లీ ప్రకాశవాణిపై చర్యలు తీసుకోవాలని కేజీబీవీ పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ ఆరేవుల ఇస్సాకు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం జిల్లా కలెక్టర్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా ఆరేవుల ఇస్సాకు మాట్లాడుతూ తాను 2019-2021 సంవత్సరంలో పుల్లలచెరువు కేజీబీవీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా పని చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో పాఠశాలకు వచ్చిన నాడు - నేడు నిధుల్లో ఎస్ఓ లిల్లీ ప్రకాశవాణి స్వయంగా కాంట్రాక్టర్ అవతారం ఎత్తి ఇష్టారీతిగా అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. చైర్మన్‌గా ఉన్న తనతో ఖాళీ చెక్కులపై



సంతకాలు తీసుకొని నిధులు డ్రా చేసుకుందని చెప్పారు. దీనిపై చాలాసార్లు అధికారులకు కూడా ఫిర్యాదు చేశానని చెప్పారు. ఎస్ఓ లిల్లీ ప్రకాశవాణి దాదాపు ఇదే పాఠశాలలో 16 సంవత్సరాలుగా పనిచేస్తూ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, మితిమీరిన రాజకీయాలకు పాఠశాలను వేదిక చేసిందని ఆరోపించారు. తాను పేరెంట్స్ కమిటి చైర్మన్‌గా ఉన్న కాలంలోనే నాకు తెలియకుండా ఆమె చైర్మన్ మాదిరిగా పనులు చేయించి ఆ బిల్లులు కూడా ఆమె మార్చుకుందని తెలిపారు. తాను ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నానని పేర్కొన్నారు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వమని ఎన్ని సార్లు అడిగినా కూడా ఆమె స్పందించకపోగా నీకు దిక్కున్నచోట చెప్పుకో అన్నట్టు ప్రవర్తిస్తున్నారని వివరించారు. తనకు మొత్తం రూ.మూడు లక్షలు రావాల్సి ఉందన్నారు. నాకు రావాల్సిన డబ్బులు చెల్లించని పక్షంలో నాకు ఆత్మహత్య చేసుకునుట తప్ప మరొక దారిలేదని వాపోయారు. అధికారులు జరిగిన నాడు నేడు పనులపై విచారణ జరిపి ఆమెపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని గంజివారిపల్లి గ్రామంలో శనివారం యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ, మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ మహాశక్తి పథకం కింద 18 ఏళ్లు నిండిన స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15వేలు, తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15వేల రూపాయలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్లు లేని ప్రయాణం తదితర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, తోట మహేష్ నాయుడు, షేక్ మస్తాన్‌వలి, మహిళా నాయకురాలు రవణమ్మ, వెములకొండ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు

అర్హత కలిగిన వారందరికీ సంక్షేమం

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

గతంలో సంక్షేమ పథకం పొందేందుకు అధికార పార్టీ నాయకులతో పాటు ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా... కొద్ది మందికి మాత్రమే అవకాశం దక్కేదని... సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందుకు భిన్నంగా అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమం అందాల్సిన వారందరికీ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి వివరించారు. స్థానిక మున్సిపాలిటీలోని 16వ వార్డులో శనివారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఆ వార్డులోని ఇంటింటా ప్రజలతో మాట్లాడారు. గత ప్రభుత్వానికి... జగనన్న ప్రభుత్వానికి గల తేడాను వివరించారు. వాలంటీరు వ్యవస్థతో పథకాలు ఇంటికి చేరుతున్నాయన్నారు. గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి, ఆయన సోదరుడు కుందురు



గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

కృష్ణమోహన్‌రెడ్డిలకు ఆ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత బాబి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు దొడ్డా భాగ్యలక్ష్మి, టి.రంగలక్ష్మి, బుశ్శెట్టి నాగేశ్వరరావు, కశ్శెట్టి నగేష్‌కుమార్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా మయూర్ కాశిం, పఠాన్ అమీరుల్లాఖాన్, మున్సిపల్ డిఇ షేక్ సుభానీ, సచివాలయ సిబ్బంది, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషగిరిరావు, నాయకులు మారంరెడ్డి రామక్రిష్ణారెడ్డి, వైపి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్.రామలింగం

గద్దర్ ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి-కొండపి

ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆశయాలను ప్రతి ఒక్కసాగించాల్సిన అవసరం ఎంతైన ఉందని అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు ఎల్.రామలింగం అన్నారు. శనివారం నాడు తహశీల్దారు కార్యాలయ ఆవరణలో గద్దర్ సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్బంగా ఎల్.రామలింగం మాట్లాడుతూ గద్దర్‌గా అందరికి సుపరిచితమైన గుమ్మడి విఠల్‌రావు విప్లవకవి అని, గద్దర్ అను పేరును స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించిన గదర్‌పార్టీకు గుర్తుగా తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సభాపరిచయం మస్తాన్, బి.నాగభూషణం, న్యూడెమోక్రసి కొండపి నాయకులు నాగరాజు, టంగుటూరు మండల సిపిఐ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



భూమన కరుణాకర్ రెడ్డిని సత్కరిస్తున్న ఎంపి మాగుంట

టిటిడి చైర్మన్‌ను కలసిన ఎంపి మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డిని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని ఆయన నివాసంలో శనివారం కలిసిన ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి భూమన్ కరుణాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు ఇరువురు పలు విషయాలు చర్చించుకున్నారు.

శ్రీను అంతిమయాత్రలో వరికూటి

ప్రజాశక్తి - టంగుటూరు.

గత శుక్రవారం రాత్రి తీవ్ర గుండెపోటుతో ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిన టంగుటూరు వాణి నగర్ వైసీపీ నాయకులు ఎస్ కె శ్రీను అలియాస్ వెల్డన్ శ్రీను అంతిమయాత్రలో కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరై అంత్యక్రియలను పర్యవేక్షించారు. శనివారం టంగుటూరు వాణి నగర్ నుండి ప్రారంభమైన వెల్డన్ శ్రీను అంతిమయాత్రలో వైసీపీ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు భారీగా హాజరై వెల్డన్ శ్రీను భౌతిక కాయానికి నివాళులర్పించి వీడ్కోలు పలికారు. అనంతరం వెల్డన్ శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, ఏఎంసి డైరెక్టర్ నల్లూరి సురేంద్ర, వైసీపీ నాయకులు దుగ్గిరాల పేర్రాజు, పలువురు ముస్లిం సోదరులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని వాలిచర్ల గ్రామంలో శనివారం కరెంట్ షాక్‌తో ఆవు మృతి చెందింది. కరెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తన ఆవు చనిపోయిందని బాధిత రైతు బైనబోయిన ఎర్రయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కాబట్టి అధికారులు తనకు నష్టపరిహారం చెల్లించాలని ఎర్రయ్య కోరాడు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

విద్యార్థుల్లో ప్రజ్ఞను వెలికి తీయాలి

బాపట్ల : విద్యా, వైజ్ఞానిక వికాసానికి ఎస్ఎఫ్ఐ చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థుల భవితకు పునాదులని విశ్రాంత అధ్యాపకులు, ఫారం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబా అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆర్య, మనోజ్ మాట్లాడుతూ 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ విద్యార్థుల్లో సామాజిక అంశాలపై శిక్షణ కార్యక్రమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి రాజేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు అలేఖ్య, భానుతేజ, రవి, దినేష్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో జనసేన నాయకులు స్వాములు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

వేటపాలెం : రామన్నట పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో చట్టబద్ధంగా జనసేన మద్దతుతో వేసిన నామినేషన్లను తిరస్కరించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని జనసేన నాయకులు ఆమంచి శ్రీనివాసరావు అన్నారు. పందిళ్ళపల్లిలోని తన స్వగృహం వద్ద శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ మద్దతుతో కిరణ్ నామినేషన్ వేశారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అతని తనయుడు వెంకటేష్ బాబు ప్రోద్బలంతో నామినేషన్ పత్రాలను చల్లనివిగా చేయటం తగదన్నారు. ఎంఎల్ఎ అనుచరుల నామినేషన్లు మాత్రమే చెల్లే విధంగా చేసి ఇతరుల నామినేషన్లన్నీ చల్లనివిగా చేయటం అప్రజాస్వామికం అన్నారు. ఎన్నికలలో గెలవలేక ఏకగ్రీవం చేయాలని కలలు కంటున్నారని ఆరోపించారు. చీరాల గడ్డ ఆమంచి అడ్డా అని పరుషంగా మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాలన్నారు. తాము చీరాల ఆర్డీవోకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కరణం వెంకటేష్ తన తల్లిని దూషించాడంటూ ఆయన తీవ్రంగా దుర్భాషలాడారు. పోలీసులను అడ్డం పెట్టుకుని దాడులు చేయడం సరికాదని అన్నారు. జనసేన ప్రకాశం జిల్లా అధ్యక్షులు రియాజ్ మాట్లాడుతూ ఇళ్లల్లో ఆడవారిని దూషించే చర్యలు మంచిది కాదని హెచ్చరించారు.



నామట్టి, నాభూమి కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది

వీరుల త్యాగాలను స్మరించుకోవాలి

చీరాల : స్వాతంత్ర సమరయోధుల అత్యాగాలను స్మరించుకోవాలని రామకృష్ణాపురం పంచాయతీ కార్యదర్శి ఎం కిరణ్ కుమార్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన నా దేశం నా మట్టి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుండే దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. మొక్కలను నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించి జెండా ఎగురవేశారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఉపాధ్యాయుల 12గంటల నిరసన ధర్నా
- జిఒ117రద్దు చేసి పాఠశాలల విలీనం ఆపాలి
- సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలి
- వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల

ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టుగా ఉన్న నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్ అన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు యుటిఎఫ్ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 117ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేసి ప్రాథమిక విద్యా వ్యవస్థను కాపాడాలని కోరారు. గత రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మంది బదిలీలైన ఉపాధ్యాయులకు జీతాలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలన్నారు. తొలుత యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు పాపారావు, సహాధ్యక్షులు బిక్షాల బాబు, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం పద్మావతి, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య పాల్గొన్నారు.



ఫ్యాప్టో ధర్నాలో మాట్లాడుతున్న జడ వినయ్‌కుమార్

వేతనాలు వెంటనే చెల్లించాలి

బాపట్ల రూరల్ : ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం 12గంటల ధర్నా చేశారు. రాష్ట్ర కోశాధికారి చింతల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల పదోన్నతులు, బదిలీలు పొందిన 50వేల మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదని అన్నారు. వెంటనే ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షం కారణంగా 12గంటల ధర్నా సామూహిక నిరసనను బాపట్ల కలెక్టర్ ఆఫీస్ నుండి ఎన్‌జీఓ హోంకు మార్చినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ టీచర్స్‌ను వేధించడం మానుకోవాలని కోరారు. ఫ్యాప్టో సీనియర్ నాయకులు చంద్ భాష మాట్లాడుతూ జీఓ 117 రద్దుచేసి పాఠశాలల విలీనం ఆపాలని కోరారు. జనరల్ సెక్రెటరీ సురేష్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత ఓపీఎస్ పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వి కుమారి, కోచైర్మన్లు షేక్ ఘన్‌సైదా, ఎన్ సురేష్ బాబు, జె వినయ్ కుమార్ , డిప్యూటీ సెక్రెటరీ పీడి సోషలిజం, ప్రసాదరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -నగరం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. ప్రజా సంక్షేమమే జగన న్న ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. పూడివాడలో శనివారం గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిం చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి లబ్దిదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్ నూరు శాతం నెరవేర్చరని అన్నారు. అర్హత ఉండి పథకాలు రానివాళ్లు తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య, ఎంపి మోపిదేవి తనయుడు మోపిదేవి రాజీవ్, సర్పంచి పాగోలు సుజాత వెంకటేశ్వరరావు, సర్పంచులు అనిల్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ బుల్లియ్య, జాలాది సునీల్, ఎంపీటీసీలు బాపనయ్య పాల్గొన్నారు.



గడప గడపకు మోపిదేవి

అంగన్వాడీలకు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

అంగనవాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డివిజన్ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యల పట్ల నిరలక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. మంత్రి ఇచ్చినా హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు14, 15తేదీలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయాలని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అని చోట్ల నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ తమకు గ్రాడ్యుటి అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అమలు చేయడంలేదని అన్నారు. సమావేశంలో రేపల్లె, పల్లపట్ల ప్రాజెక్టుల నాయకులు వై మేరీమణి, డి జ్యోతి, ఎన్ కృష్ణకుమారి, శివనాగులు పాల్గొన్నారు.



సిఐటియు కార్యదర్శి మణిలాల్

కొండయ్య నోరు అదుపులో పెట్టుకోవాలి

ప్రజశక్తి - చీరాల

నామినేషన్ పత్రాలు పూరించడం చేతకాని టీడీపీ ఇంచార్జి కొండయ్య ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి, వైస్సార్సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ గురించి అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని వైస్సార్సీపీ నాయకులు అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ఇంచార్జి కొండయ్య చేసిన ఆరోపణలను ఖండించారు. నామినేషన్లు పూర్తి చేయడం రాక తిరస్కరణైతే ఎమ్మెల్యే, వైస్సార్సీపీ ఇంచార్జిపై అక్కసు కక్కటం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఎమ్మెల్యే ద్వారా ఐదు ఎకరాలు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్న కొండయ్య ఎవరో ఇచ్చిన స్క్రిప్టులు చదివుతున్నారని ఆరోపించారు. ఎస్సిలను రాజకీయంగా తక్కువ చేసేందుకు వారికున్న పట్టణ అధ్యక్షుడిని పదవి తొలగించలేదాని ప్రశ్నించారు. పర్చూరు వైసిపి ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆమంచి కృష్ణమోహన్‌కు చీరాలలో ఏం పని ప్రశ్నించారు. కార్యక్రమంలో మల్లి రామకృష్ణ, ఆసోది అంకాలరెడ్డి, సుబ్బయ్య, కావూరి రమణారెడ్డి, సంజీవరావు, వాసిమల్ల వాసు, శ్రీను పాల్గొన్నారు.



కొండయ్య - ఆమంచి పై ఫోటోలు చూపుతున్న వైసిపి నేతలు

ఎస్పీని కలిసి అంతా వివరించా: ఆమంచి

ప్రజాశక్తి - చీరాల

రామన్నపేట వివాదం గురించి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి అంతా వివరించానని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. కానిస్టేబుల్‌ను పరామర్శించేందుకు ఏరియా వైద్యశాలకు వచ్చిన ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు. పోలీసులు నమోదు చేసిన కేసులో ఎంతమంది మీ అనుచరులు ఉన్నారని మీడియా అడుగగా తమ అనుచరుల పైనే దాడులు జరిగాయని అన్నారు. వీడియోలలో చాలా స్పష్టంగా ఉన్నాయని అన్నారు. కానిస్టేబుల్‌పై ఎవరు రాళ్ల దాడి చేసారో కూడా వీడియోలు పోలీసుల వద్ద ఉన్నాయని అన్నారు. వేటపాలెం ఎస్సై సురేష్ సమక్షంలోనే రాళ్ల దాడి, కారు అద్దాలు పగలగొట్టారని ఆరోపించారు. పోలీసులు చూస్తుండగానే నామినేషన్ పేపర్లును చించేశారని అన్నారు. బండ్ల బాబూపై దాడి చేశారని తెలిపారు. **కానిస్టేబుల్ ఆమంచి పరామర్శ :** తలకు గాయమై చికిత్స పొందుతున్న మహిళా కానిస్టేబుల్ సునీతను మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ శనివారం పరామర్శించారు. గాయాన్ని పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తలకు బలమైన గాయం కావడంతో గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ కు తరలిస్తున్నట్లు హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ సుభాషిని ఆమంచికి తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రేగోరి, కౌన్సిలర్ సత్యానందం, చీరాల వైసీపీ నాయకులు ఎంద్రపాటి సునీల్, న్యాయవాదులు షేక్ సిరాజ్ ఉన్నారు.



పరామర్శిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

నేతల త్యాగాలు స్ఫూర్తిదాయకం

చీరాల : స్వాతంత్రం కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్యేక అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. జాండ్రపేట పంచాయతీ కార్యదర్శి బాపూజీ ఆధ్వర్యంలో జరిగిన ఆజాద్గా అమృత్ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటి, జెండా వందనం, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుధారాణి పాల్గొన్నారు.

పోస్టాఫీసులో జాతీయ జెండాలు

నిజాంపట్నం : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా 2.0' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ జాతీయ జెండాల పంపిణీని చేపట్టిందని నిజాంపట్నం పోస్టు మాస్టర్ వి శ్రీనివాస్ గాంధీ శనివారం తెలిపారు. పతాకాన్ని రూ.25లకు ఇస్తున్నట్లు తెలిపారు.

ఎస్సై సురేష్ పై ఎస్పీకి ఫిర్యాదు

వేటపాలెం : ఎస్సై గుడిపల్లి సురేష్ పోలీస్ వ్యవస్థను అప్రతిష్ట పాలు చేసే విధంగా నెల మామూలు తీసుకుంటూ అక్రమార్కుల కు వత్తాసు పలుకుతున్నాడని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. నామినేషన్ వేయకుండా అడ్డుకునేందుకు దేవన గంగాధర్ అనే అతని ఇంటిలో మద్యం సీసాలు పెట్టి అతనిపై కేసు కట్టినట్లు ఆరోపించారు. ఎస్సై పై శాఖపరమైన చర్యలు తీసుకొని కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి

ప్రభుత్వం ప్రణాళిక తయారుచేయాలి

జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-కనిగిరి / పిసిపల్లి

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వమే ఒక ప్రణాళిక తయారు చేయాలని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. ప్రకాశం జిల్లా జనవిజ్ఞానవేదిక 17వ మహాసభలు శనివారం కనిగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డాక్టర్ నరేంద్ర దబోల్కర్ ప్రాంగణంలో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా గేయానంద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా విభజన కూడా సక్రమంగా జరగలేదన్నారు. సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఒక ప్రాజెక్టును ఏర్పాటు చేసి కనిగిరి అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ప్రశ్నించే తత్వంపై సైన్స్ ఆధారపడి ఉందని అన్నారు. సైన్స్ భౌతిక వాదనను బలపరుస్తుందని, రుజువుకు నిలబడితే సైన్స్ అని ఆయన అన్నారు. శనివారం సాయంత్రం ఒంగోలు బస్టాండ్ ఆవరణ లో జడ్ రమణయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మణిపూర్ సంఘటన రాజ్యాంగం మీద జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. మేకిన్ ఇండియా అంటున్న బిజెపి ప్రభుత్వం రామానుజాచార్యులు విగ్రహాన్ని, దీపావళి పండుగ రోజు వాడే మందులను, పటేల్ విగ్రహాన్ని చైనా వారి చేత తయారు చేయించేవే అని విమర్శించారు. జెవివి సైన్స్‌ను



జెవివి మహాసభలో మాట్లాడుతున్న ఎస్ వెంకటరావు

ప్రచారం చేస్తూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ విధంగా సైన్స్‌తోనే సమాజాభివృద్ధి జరుగుతుందని నమ్ముతూ సైన్స్ కోసం విస్తృతంగా ప్రచారం చేస్తూ ముందుకు పోతోందన్నారు జిల్లా మహాసభలు కనిగిరిలో జరుపుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. డాక్టర్ టి చెన్నకృష్ణ అధ్యక్షతన ఈ మహాసభలు ప్రారంభమయ్యాయి. మొదట జాతీయ పతాకాన్ని కనిగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి రమణారెడ్డి ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక పతాకావిష్కరణ కనిగిరికి చెందిన ప్రముఖ చిన్న పిల్లలు వైద్యులు డాక్టర్ సిహెచ్ గురుబ్రహ్మం ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరై ప్రసంగించారు. సైన్స్ రచయిత ఎస్ వెంకట్రావు శాస్త్రీయ అవగాహన మూఢనమ్మకాల గురించి శాస్త్ర సాంకేతిక అభివృద్ధి గురించి వివరించారు. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగం ఒకవైపు దూసుకుపోతూ ఉంటే మరోవైపు మూఢనమ్మకాలతో, మత విశ్వాసాలతో దేశంలో బిజెపి పాలన సాగిస్తోందని, దీని వలన దేశంలో అభివృద్ధి కుంటుపడుతుం దని ఆయన విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. సీనియర్ నాయకులు మూల బ్రహ్మారెడ్డి, వి మాలకొండ రెడ్డి, జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్, జెవివి రాష్ట్ర పబ్లికేషన్స్ కన్వీనర్ కే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కమిటీ సభ్యులు కే స్వరూపారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభను ఉద్దేశించి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ జవహర్, ఏవి పుల్లారావు మాట్లాడారు. బహిరంగసభ వద్ద సమత జిల్లా కన్వీనర్ బషీరా, కనిగిరి మహిళా కన్వీనర్ గిరిజ ఆధ్వర్యంలో ఎడవల్లి స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కనిగిరి డివిజన్ కార్యదర్శి జి శ్రీనివాసరెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫార్, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, కరణం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ టి శ్రీరామ్

ఎంసెట్ ర్యాంకులే లక్ష్యంగా 'అమృత' కళాశాల

ప్రజాశక్తి-శింగరాయకొండ

గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల కల అయిన ఎంసెట్ ర్యాంకులే ధ్యేయంగా అమృత జూనియర్ కళాశాల పనిచేస్తుందని కళాశాల చైర్మన్ కేశవరపు జాలిరెడ్డి అన్నారు. అమృత జూనియర్ కళాశాలలో ఎంసెట్ ప్రశ్న పత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్పొ రేట్ సంస్థలకు పోటీగా లాభాపేక్ష లేకుండా పేద విద్యార్థులకు విద్యను అందించాలనే ధ్యేయంతో కళాశాల విద్యను అందిస్తోందని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శింగరాయ కొండ ఎస్ఐ టీ శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ నుంచి చదువుపై ప్రత్యేక శ్రద్ధపెట్టి చదివితే మంచి భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. శింగరాయకొండ లాంటి చిన్న గ్రామంలో తక్కువ ఖర్చుతో మంచి విద్యను అందిస్తున్న అమృత జూనియర్ కళాశాలకు విద్యార్థులు మంచి పేరును తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కృషి, పట్టుదల ఉంటే విద్యార్థులు తాము ఎంచుకున్న మార్గంలో గెలుపు సాధిస్తారని అన్నారు. ఇప్పటి నుండే ఒక లక్ష్యాన్ని పెట్టుకుని చదవాలన్నారు. అనంతరం ఎంసెట్ ప్రశ్నాపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కళాశాల యాజమాన్యం ఎస్ఐని సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం భారతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

హెచ్‌ఎం భారతికి సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి బదిలీపై వెళ్లిన దుంప భారతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దుంప భారతి ప్రధానోపాధ్యాయురాలుగా బాలికల ఉన్నత పాఠశాలలో బాగా అభివృద్ధి చేశారన్నారు. దుంప భారతిని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. కొండేపి మండలం ఉప్పలపాడుకు బదిలీ అయిన ఆమె ఆ పాఠశాలను కూడా అభివృద్ధి దిశలో నడిపించాలని సూచించారు. అదేవిధంగా ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాళ్లు పి రాధామాధవి, కే పద్మ, సిహెచ్ రమాదేవి, కెవి లక్ష్మి, ఎస్ కోటేశ్వరమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి ఎంపీటీసీ సోమిశెట్టి వాసవిదేవి స్కూల్ చైర్మన్ మునగనూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్‌రెడ్డే రావాలి

కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్ రెడ్డి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్‌యాదవ్ అన్నారు. శనివారం వెలిగండ్ల మండలం కంకణంపాడు పంచాయతీ పరిధిలోని కే అగ్రహారం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల వారు వైఎస్‌ఆర్ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉంటున్నారని అన్నారు. నేరుగా ప్రజల అకౌంట్లో డబ్బులు జమవుతున్నాయని, ప్రతి గడపలో ఆదరణ కనిపిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామన తిరుపతిరెడ్డి, వైసీపీ నాయకులు నాగూర్ యాదవ్, జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాతపూడి దేవ సహాయం, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు పొల్ల సుబ్రహ్మణ్యం, సర్పంచ్ వేమవరపు విమలమ్మ, రాష్ట్ర ఆరెకటిక చైర్మన్ దాదా లక్ష్మీకుమారి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ కుప్పనపోయిన పద్మావతి, కుప్పన బోయిన వెంకటరామయ్య, మేడం ఆదిరెడ్డి, బొబ్బ వెంకటరెడ్డి, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి మారం వెంకటేశ్వర రెడ్డి,గజ్జల నాగేశ్వరరావు,సురపరెడ్డి ఆదినారాయణరెడ్డి, తాతపూడి నాని, దాదా సోమయ్య, నన్నసాని భాస్కర్, చల్లా మాలకొండయ్య, ఎంపీడీవో తాతపూడి సుకుమార్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్



నివాళి అర్పిస్తున్న సిఐటియు నాయకురాలు ఉబ్బా ఆదిలక్ష్మి

అంగన్‌వాడీ వర్కర్ మృతికి నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని గుండ్లపల్లి అంగన్‌వాడీ వర్కర్ కొప్పోలు ప్రభావతి(47) శనివారం మరణించారు. ప్రభావతి 25 సంవత్సరాలుగా అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. చికిత్స పొందుతూ మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభావతి మృతదేహానికి సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ రజిని, నర్మద, అంజమ్మ, వెంకటరత్నం, శ్రీదేవి ఉన్నారు.




గడప గడపకూలో పాల్గొన్న మంత్రి సురేష్

విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు: మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శవంతమైన రీతిలో అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపిస్తూ విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం మండలంలోని మొగుళ్ళపల్లి గ్రామంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాదయాత్రగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందుతున్న తీరుపై మహిళలు, వద్ధులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ విద్యారంగాన్ని గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించారని అన్నారు. ప్రజలు మంత్రి సురేష్ దృష్టికి తీసుకు వచ్చిన పలు సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామం సెయింట్ జాకబ్స్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్స్‌లో శనివారం రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌రెడ్డిని కమిటీ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. శాలువా, పూల మాలలతో సన్మానించారు. అనంతరం క్రీడాకారులందరితో అశోక్‌రెడ్డి కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కడియం శేషగిరిరావు, గంజి వీరయ్య, బొమ్మినేని వెంకటేశ్వర్లు, శివపురం మురళీ, మండ్ల రంగనాయకులు, మార్తాల సుబ్రహ్మణ్యంరెడ్డి, అరిగేల నారాయణ, శీలం శేఖర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కల్యాణ మండపం

ప్రారంభానికి నోచకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్న వైనం

ప్రజాశక్తి-సిఎస్ పురం రూరల్

ప్రజల సౌకర్యార్థం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కల్యాణ మండపం నిరుపయోగంగా మారింది. ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకుంటోంది. మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి సమీపంలో 2012 ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో దాదాపు రూ.80 లక్షలతో తిరుమల తిరుపతి దేవస్థానం వారు కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ మండపం నిర్మాణం కోసం ప్రజల వాటాగా మరో రూ.8 లక్షలు ఖర్చు చేశారు. ఇవి కాకుండా నారాయణస్వామి దేవస్థానం వారు మరో రూ.2.50 లక్షలు ఖర్చు చేసి మండపం వద్ద గ్రావెల్ తోలించారు. 2012లో నిర్మాణ పనులు ప్రారంభించిన అధికారులు 2014 నాటికి కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే భవన నిర్మాణం పూర్తి చేసిన అధికారులు కల్యాణ మండపానికి అవసరమైన వసతులను సమకూర్చలేదు. సరి కదా మండపాన్ని ప్రారంభించనూ లేదు. భవన నిర్మాణం పూర్తి చేసి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. గోడలు పలుచోట్ల నెర్రెలిచ్చాయి. కిటికీలకు అమర్చిన అద్దాలు కొన్ని పగిలిపోయాయి. నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్యాంక్ రంధ్రాలు పడి నీరు కారిపోతోంది.



టీటీడీ నిర్మించిన కల్యాణ మండపం



పగిలిపోయిన కిటికీ

వసతుల కల్పనలో నిర్లక్ష్యం

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కల్యాణ మండపంలో వసతులు సమకూర్చడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. కళ్యాణ మండపం హాలులో కుర్చీలు, భోజనం తయారు చేసే హాలులో టేబుళ్లు, వంట చేసుకునేందుకు పాత్రలు అవసరమై ఉన్నాయి. మండపంలో ఈ వసతులు లేకపోవడంతో మండపంలో వివాహాలు చేయాలని తలచిన ప్రజలు కూడా ఈ మండపంలో వివాహాలు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. అధికారులు స్పందించి మండపానికి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. తగిన సదుపాయాలు కల్పించి వెంటనే కల్యాణ మండపాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై నారాయణస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు కల్యాణ మండపాన్ని ఇప్పటివరకు నారాయణస్వామి ఆలయానికి అప్పగించలేదని అన్నారు. ఈ విషయంపై ఇటీవల టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి విన్నవించామని వివరించారు.

108 అంబులెన్స్‌లోనే కాన్పు

ప్రజాశక్తి-వెలిగండ్ల



అంబులెన్స్‌లో జన్మించిన శిశువుతో బంధువులు, సిబ్బంది

108 అంబులెన్స్‌లోనే ఓ మహిళకు కాన్పు చేసిన సంఘటన శనివారం జరిగింది. వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన ఎస్ కేశమ్మ అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. స్పందించిన సిబ్బంది ఈఎమ్‌టీ కేశవ నారాయణ, పైలెట్ మస్తాన్‌వలి కనిగిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ సైడ్ ఆపి కాన్పు చేశారు. మగబిడ్డ జన్మించాడు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న పేషంట్ బంధువులు, గ్రామస్తులు అంబులెన్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. 108 డిస్ట్రిక్ట్ మేనేజర్ విజయకుమార్, కనిగిరి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శివరాం సిబ్బందిని అభినందించారు.



బెల్లంకొండవారిపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ తదితరులు

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-దరిశి: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిటిసి సరస్వతి ఆధ్వర్యంలో గ్రామంలోని పాఠశాల వద్ద మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోశం సుమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నా భూమి, నా దేశం కార్యక్రమం నిర్వహిస్తు్న అధికారులు


పోతవరంలో 'నాభూమి నాదేశం'

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు: మండలంలోని పోతవరం గ్రామంలో డుమా ఆధ్వర్యంలో నాభూమి నాదేశం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నలమలపు అంజమ్మ మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీరులను స్మరించు కోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. వీరులకు వందనం స్తూపం ఏర్పాటు చేశారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. నీరు, మొక్కలు ఉంటేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. స్వచ్ఛమైన గాలి, సారవంతమైన భూమిని భావితరాలకు అందించాలన్నారు. వీరులు చేసిన త్యాగాల వల్లనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. భారత మనుగడను కాపాడు కోవడానికి అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. శిలాఫలకం వద్ద మొక్కలు నాటారు. కొత్తకోట చదలవాడ గ్రామాల్లో వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. వీరులు చేసిన త్యాగాలను వివరించారు. కొత్తకోటలో విశ్రాంత జవానులు చిన్నం సురేష్, రమేష్‌లను శాలవతో ఎంపిపి అంజమ్మ కృష్ణా రెడ్డి దంపతులు సన్మానిం చారు. ఆయా కార్యక్రమాల్లో సర్పం చ్‌లు శీలం రేణుక, చిన్నం సుజాత, దాసరి వరప్రసాదరావు, నలమలపు కృష్ణారెడ్డి, సురేష్, రమేష్, హరిబాబు, బాలకృష్ణ, ఎంపిడిఓ జయమణి, పిఆర్ ఏఇ ప్రసాదు, ఎపిఓ రవి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-దరిశి

నేడు దరిశి నియోజకవర్గ స్థాయిలో జరిగే టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలని ఎంఇఒ కాకర్ల రఘురామయ్య అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ప్రజాసంకల్ప వేదిక సొసైటీ ఆధ్వర్యంలో జరిగే టాలెంట్ టెస్టును హైకోర్టు న్యాయవాది మదిరి రంగసాయిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. దరిశితోపాటు నియోజకవర్గం లోని నాలుగు మండలాలలో జరిగే ఈ టాలెంట్ టెస్టుకు చట్టాలపై అవగాహన పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంకల్ప వేదిక సొసైటీ ప్రతినిధులు ఎస్ కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, రవినాయక్, సాయితేజ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ రఘురామయ్య

ఎంపిపి, జడ్‌పిటిసి వర్సెస్ ఎంపిడిఒ

తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశంలో రభస ● సభను బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిన ఎంపిపి, జడ్‌పిటిసి, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-దరిశి

తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో జరిగింది. ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు అజెండాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ గ్రామీణ నీటిసరఫరా విభాగంపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సభలో రామభద్రాపురం సర్పంచ్ బి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ తాగునీరు గ్రామానికి రేపు మీటింగు అనుకొని అధికారులు వదిలారని 3 నెలల నుంచి తాగునీరు రాలేదని ప్రశ్నించారు. పైపులైను బాగులేనందున వలన నీళ్లు వదలేదని ఎఇ తెలిపారు. ఈ సందర్భంగా మల్కాపురం సర్పంచ్ వలి మాట్లాడుతూ తాను గ్రామంలో ఉన్న బావిని పూడ్చానని బిల్లులు పంచాయితీ కార్యదర్శి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఎప్పటిలోపు బిల్లులు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు జోక్యం చేసుకున్న మల్కాపురం పంచాయతీ కార్యదర్శి సభలో లేరా అని అడిగారు. ఎంపిడిఒ శ్రీనివాసరావు స్పందించి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఎవరూ రాలేదని వీటికి సంబంధించిన వివరణ మేము చెప్పుతామని ఎంపిడిఒ అన్నారు. విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు ఎవరూ సమావేశానికి రాలేదని తెలపడంతో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు లేకుండా సంబంధించిన ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారని, ఎవరు లేకుండా సమావేశమెందుకని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సభలో మేము ఉండమని బాయ్‌కాట్ చేస్తామని ఎంపిపి, జడ్‌పిటిసి ఆవేశంగా మాట్లాడారు. సభలో ఎంపిడిఒ శ్రీనివాసరావుపై వాగ్వాదానికి దిగారు. ఇంతలో ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డిలు సభను బాయ్‌కాట్ చేస్తున్నామని, అందరూ బయటకు రావాలని వెళ్లిపోయారు. సభను ఇంతటితో ముగిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరావు ప్రకటించి వెళ్లిపోయారు. దీంతో సభ అర్ధాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ప్రసాద్, వైస్‌ఎంపిపిలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మారం ప్రియాంక, డిఇ విఠల్‌రాథోడ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు మారం ఇంద్రసేనారెడ్డి, కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, ఎంపిటిసిలు, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో వాదన చేసుకుంటున్న ఎంపిపి, ఎంపిడిఒ

- ఎంపిడిఒ, ఎంపిపిల మధ్య అగాథం

- కుంటుబడుతున్న అభివృద్ధి

దరిశి నియోజకవర్గంలో దరిశి, తాళ్లూరు మండలాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వర్సెస్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల మధ్య అగాథం ఏర్పడుతోంది. నియోజకవర్గంలోని దరిశి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలో మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులుగా ఇటీవల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నియమించినవారు కొనసాగుతున్నారు. అయితే ఇటీవల జరిగిన దరిశి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి గోళ్లపాటి సుధారాణి తనకు తెలియకుండా మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారని, తనను అవమానించారని మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో మధ్యలో లేచి వెళ్లిపోయి దళిత నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి గోళ్లపాటి సుధారాణి మీడియాతో మాట్లాడుతూ ఎంపిడిఒ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, తనకు సహకరించడంలేదని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం సర్వసభ్య సమావేశం సాగించారు. అదేవిధంగా తాళ్లూరులో కూడా మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి వర్సెస్ ఎంపిడిఒ శ్రీనివాసరావుకు మధ్య అగాథం మొదలైనట్లుగా సభలో వెల్లడైయింది. ఈ సందర్భంగా ఎంపిడిఒను మార్చాలని ఇటీవల కలెక్టరు దినేష్‌కుమార్‌కు ఎంపిపి, జడ్‌పిటిసిలు, నాయకులు కలిసి వినతిపత్రం కూడా అందించారు. అంతకముందు ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎంపిపిల మాట ఎంపిడిఒలు వినటంలేదని బహిరంగంగానే తాళ్లూరు, దరిశిలో చర్చ జరుగుతోంది. ముండ్లమూరు సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. దరిశి, తాళ్లూరు మండలాలలో ఎంపిపిలకు, ఎంపిడిఒలకు మధ్య సమన్వయం లేకపోవడంతో పలు ఎంపిటిసిలు, సర్పంచులు అంతర్గతంగా మదనపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తే ప్రజాసమస్యలు తీరి మండల అభివృద్ధి జరుగుతుందనేది వాస్తవం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేసే విధంగా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని, స్థానిక మండలాల ఎంపిటిసిలు, సర్పంచులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా - పట్టించుకోని అధికారులు


అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రతి నెల వందల క్వింటాళ్ళ రేషన్ బియ్యం నల్లబజారుకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఏడాదికి ఒకటి, రెండు సార్లు మినహా విజిలెన్స్ అధికారులు కూడా తనిఖీలు చేయడంలేదు. భట్టిప్రోలు కేంద్రంగా కొల్లూరు, వేమూరు మండలాల నుండి బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. భట్టిప్రోలు రేషన్ షాపుల నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వాహనాలు అక్రమార్కులకు యధేశ్చగా చేరవేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీరంతా అర్ధరాత్రి సమయంలో స్థానిక మార్కెట్ యార్డును చేర్చి అక్కడ లారీలలోకి మారుస్తుంటారు. అక్రమార్కులు అద్దెకు తీసుకున్న భట్టిప్రోలు బాలాజీ రైస్ మిల్లుకు తరలించి గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ప్యాకింగ్ మార్చి ప్రైవేటు బియ్యం వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ట్రేడింగ్ అనుమతి ఉన్న ఈ రైస్ మిల్లు ద్వారా ఎఫ్‌సిఐకి కూడా ఈ అక్రమ బియ్యం తరలిస్తున్నట్లు ఆరోపణ ఉంది. ఎఫ్‌సిఐ ఆర్డర్ లేకపోతే నేరుగా 216 జాతీయ రహదారిలో కాకినాడ పోర్టుకు తరలిస్తుంటారు. పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే అక్రయాలు జరుగుతున్నాయినే ఆరోపణలు ఉన్నాయి. ఎవరి మామూళ్లు వారికి ముట్టచెప్పేటప్పుడు మమ్ములను ఎవరు పట్టుకుంటారనే ధీమా అక్రమార్కులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పట్టుకున్నా కేసులతో భయపడేది లేదని అక్రమార్కులైన దీపాల శ్రీనివాసరావు, నాగ మల్లెస్వరరావు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారనే ప్రచారం ఉంది. ఇదిలావుండగా గత రెండు రోజుల క్రితం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేసి సుమారు 700బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఇలా పట్టుబడటం కొత్తేమి కాదు. గత ఏడాదిగా ఇదే వ్యాపారం చేస్తున్నామని, ఇవన్నీ మాములే అంటూ కొట్టి పరిస్తున్నారు. కరోనా సమయంలో ప్రభుత్వాలు ఉచితంగా అందించిన బియ్యంతో అక్రమ వ్యాపారం ఉధృతమైంది. ప్రభుత్వం ఎన్ని రకాల హెచ్చరికలు చేసిన క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే అక్రమార్కుల ఆగడాలు ఆగే పరిస్థితి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రేషన్ అక్రమ వ్యాపారులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సు

ఇంకొల్లు రూరల్ : ప్రాథమిక వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇంకొల్లు ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం 11 గంటలకు గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షులు షేక్ ఇంతియాజ్ తెలిపారు. గుంటూరు నుహ హాస్పిటల్ డాక్టర్ ఎస్ నవాజీష్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీలు, పిఎంపిలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


రంగనాథన్ చిత్రపటానికి నివాళులు

రంగనాథన్ జయంతి వేడుకలు

సంతమాగులూరు : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహులు స్వర్గీయ ఎస్సార్ రంగనాథన్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన కృషిని కొనియాడారు.



ర్యాగింగ్‌పై మాట్లాడుతున్న భట్టు

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

బాపట్ల : విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బిఎస్ నారాయణభట్టు అన్నారు. స్థానిక వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. యువత రక్తదానాలు, మొక్కలు నాటడం వంటి సామాజిక కార్యక్రమాలతో పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు పచ్చదనాన్ని అందించాలన్నారు. అనాథ, వృద్ధ ఆశ్రమాలను సందర్శించి వృద్ధాప్యంలో ఉన్న వారిపట్ల మానవత్వం చాటుకోవాలన్నారు. సీఐ పి కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, డ్రగ్స్ అక్రమ రవాణా, సైబర్ దుర్వినియోగం వంటి నేరాలపై ఎస్ఐ ఎండీ రఫీ వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ రవిబాబు, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఎస్ఐపై అత్యాచారం కేసు



ప్రజాశక్తి - అద్దంకి

అద్దంకి పోలీస్ స్టేషన్లో గతంలో ఎస్సై గా విధులు నిర్వహించిన సమందర్ వలిపై అత్యాచారం కేసు నమోదు అయింది. పట్టణంలోని గానుగపాలెంకు చెందిన ఓ యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఇటీవల అద్దంకి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన పుట్టినరోజు వేడుకలకు రమ్మని మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేసినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తనను పెళ్లి చేసుకోమని అడిగితే బెదిరిస్తున్నారంటూ పోలీసులు వద్ద కన్నీరు కార్చింది.

రోటరీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావుకు అభినందలు


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ద్వారా 2022-23లో చేసిన సేవా కార్యక్రమాలకు జిల్లా స్థాయిలో సూపర్ స్టార్ అవార్డు, వ్యక్తిగతంగా ద్వితీయ ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డుకు రోటరీ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రోటరీ ఫ్యామిలీ మీట్‌కు చిన్ని మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. సభలో రోటరీ 3150డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి అభినందన సంచికను ఆవిష్కరించారు. అద్దంకి రోటరీ క్లబ్ 204సైకిళ్ళు, కళ్ళజోళ్ళు బాలికలకు, 10 మందికి తోపుడు బళ్ళు, పేదమహిళలకు కుట్టు మిషన్లు, మెగా రక్తదాన శిబిరం, పెద కాకాని శంకర కంటి హాస్పత్రి ద్వారా 250మందికి కంటి శుక్ల శస్త్ర చికిత్సలు వంటి 200కుపైగా సేవా కార్యక్రమాలు చేసి సూపర్ స్టార్ అవార్డు సాధించారని శాలువాలు, పూలమాలతో సత్కరించారు. శ్రీరామచంద్రమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, గల్లా సాంబశివరావు, అద్దంకి లేవిప్రసాద్, వీరవల్లి రుద్రయ్య, డాక్టర్ ఉబ్బా దేవపాలన, క్రిష్ణారెడ్డి, శ్రీనివాస రావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, ఆంజనేయులు, సుబ్బారావు, పువ్వాడ రామ కోటేశ్వరరావు, సంకా బాబు, దివాకరదత్తు, షేక్ మొహమ్మద్ రఫీ, నరసింహారావు, శ్రీనివాసరావు, మురళీ సుధాకరరావు, డాక్టర్ ఖాజావలి, అంజాద్ భాష, కమ్మ నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, గుణశేఖర్, ఏజిపి వై రమేష్ పాల్గొన్నారు.

ప్రజా గాయని విమలక్కకు సత్కారం


రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

సాహితీ సాంస్కృతిక సంస్థ శంకరం వేదిక ఆధ్వర్యంలో కళారత్న యలవర్తి రాజేంద్రప్రసాద్ 68వ జయంతిని మండలోని అప్పికట్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. అప్పికట్ల, హైదరాబాద్‌లలో గత 20ఏళ్లుగా కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లోని ప్రముఖులను సత్కరిస్తూ, వివిధ రంగాల్లోని వ్యక్తులకు ఆర్థిక సహాయం అందిస్తున్న శంకరం వేదిక ఆధ్వర్యంలో జరిగిన జయంతి సభలో ప్రజాగాయని విమలక్కను సత్కరించారు. ఆమెకు యలవర్తి రాజేంద్రప్రసాద్ తొలి స్మారక పురస్కారాన్ని రాజేంద్రప్రసాద్ సతీమణి యలవర్తి ధనలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. చేనేత దుశ్శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రం, చేనేత చీరతో సత్కరించారు. ఈసందర్భంగా విమలక్క మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ అరుణోదయ సంస్థ వ్యవస్థాపక సభ్యులుగా తమకు పరిచయమని అన్నారు. వ్యక్తిగతంగా ఆయన మంచి మనిషని అన్నారు. తాను తెలంగాణ బిడ్డనైనప్పటికీ ఈ సత్కారం మీ బిడ్డనయ్యానని అన్నారు. మిత్ర రాసిన అప్పికట్ల గ్రామప్రాశస్త్యం పాటను విమలక్క తన బృందగానంతో ప్రజలను మెప్పించారు. చిరంజీవి నయన్ తయారు చేసిన వీడియోలోని రాజేంద్రప్రసాద్ చివరి మాటలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఎంజీఆర్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎన్ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రంగస్థల నటులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ, డాక్టర్ బిక్కి కృష్ణ, నటుడు, రచయిత కృష్ణేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు కుర్రా విజయ్ కుమార్, రాజేంద్రప్రసాద్ కుటుంబసభ్యులు పాండు, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

మోదీ రాజీనామా చేయాలని భారీ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న క్రైస్తవ, ముస్లింలు

ప్రజాశక్తి -రేపల్లె

ప్రధాని నరేంద్ర మోదీ మతతత్వ విధానాలే మణిపూర్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనలకు కారణమని క్రైస్తవ, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు ఆరోపిం చారు. మణిపూర్ మారణ హెూమానికి నిరసనగా శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్, ముస్లీమ్ మత పెద్దల ఆధ్వర్యంలో ఐఆర్ఈఎఫ్ సంస్థ నుండి ప్రారంభమైన ర్యాలీ మసీదు సెంటర్, బస్టాండ్, పద్మావతి సెంటర్, రింగ్ రోడ్డు మీదుగా తాలూకా సెంటర్‌కు చేరుకుంది. మోదీ మతతత్వ విధానాలు నశించాలని, మోదీ రాజీనామా చేయాలని, లౌకిక వాదాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఏపీ క్రిస్టియన్ సెల్ నాయకులు బాలస్వామి, ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ రెబ్బా ఇమ్మనియేలు మాట్లాడుతూ దేశాన్ని ఎంతో మంది ప్రధానులు పాలించారు కానీ మోదీ లాంటి మత టెర్రరిజాన్ని రెచ్చగొట్టే వ్యక్తిని ఇంతవరకు చూడలేదన్నారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు మత కల్లోలాకు మోదీ పాల్పడ్డారని ఆరోపించారు. మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముస్లీమ్ మత గురువు ఖాజీ తయ్యుబ్, నాయకులు జమీర్, మోహిద్దీన్ మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు సిహెచ్ మణిలాల్, కాంగ్రెస్ మాజీ ఇంచార్జ్ మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. మోడీని గద్దె దింపేందుకు ప్రజలు ఐక్యం కావాలని కోరారు. కార్యక్రమంలో పోస్టర్లు శామ్యూల్, ఇస్సాక్, మత్తయి, హనోక్, ముస్లీమ్ నేతలు ఖాన్ భాషా, అరీఫుల్ల, లాకర్ భాషా, మక్బుల్, ప్రశాంత్, సాంబశివరావు పాల్గొన్నారు.


సమర యోధులకు వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

సమరయోధులకు నివాళి

బాపట్ల : బాపట్ల ప్రాంతంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం అద్వితీయమైందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. క్విట్ ఇండియా 81వ వార్షికోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్దగల సమర యోధుల శిలాఫలకానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1942 ఆగస్టు 12న బాపట్లలో క్విట్ ఇండియా ఉద్యమం పెద్ద ఎత్తున జరిగిందని గుర్తు చేశారు. ఉద్రిక్తమైన జనసమూహాలు బాపట్ల రైల్వే స్టేషన్‌పై దాడి చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. అప్పట్లో ప్రజలు బాపట్ల సబ్ కోర్టుపై దాడి చేశారని అన్నారు. నాళం రామచంద్రరావు సబ్ జడ్జి కుర్చీలో కూర్చొని బాపట్ల స్వతంత్ర పట్టణమని ప్రకటిం చారని తెలిపారు. వివిఎల్ సుందరరావు, దేశిరాజు శర్మ బాపట్ల తాలూకా ప్రాంతమంతా పర్యటించి ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. అప్పటి బ్రిటిష్ పోలీసులు పలువురిని నిర్బంధంలోకి తీసుకున్న ఘటనలు స్వాతంత్రో ద్యమంలో జరిగాయని చెప్పారు. కార్యక్రమంలో జెవివి నాయకులు భాస్కరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బడుగు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, వినయ్, సురేష్, చాంద్ బాషా పాల్గొన్నారు.


పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

ఉచిత పశు వైద్య శిబిరం

కారంచేడు : ఆదిపూడిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 12పశువులకు సాధారణ చికిత్స, 31పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్స, 67 పశువులకునట్టల నివారణ వ్యాధులకు చికిత్సలు చేశారు. పశుపోషకులకు అధిక దిగుబడి ఇచ్చే పశుగ్రాసవిత్తనాలు, అత్యవసర పశు అంబులెన్స్ సంచార పశు క్లినిక్ సేవలు, 1962 నెంబర్ కాల్ సెంటర్‌పై పశుపోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కారంచేడు పశువైద్య అధికారి డి భాగ్యరాజు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ పేర్లి రత్న కుమార్ పాల్గొన్నారు.


పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

రోటరీ ఆర్థిక చేయూత

పర్చూరు : ఎస్ఎఫ్ఎస్ హై స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేసిన తుర్లపాటి రామ్మూర్తి మాస్టారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతని కుటుంబానికి ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో నాగులపాలెం పూర్వ విద్యార్థుల నుండి రోటరీ సభ్యులు పాబోలు వెంకటేశ్వర్లు, రోటరీ కమ్యూనిటీ ట్రస్ట్ అధ్యక్షుడు పొత్రు రాఘవయ్య రూ.1.25లక్షలు సమీకరించారు. వీటిని క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా మాస్టారు భార్య తుర్లపాటి దుర్గాంబకు అందజేశారు. సహాయం చేసిన పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, తేళ్ల రమేష్‌చంద్ర, కోమటి ఆంజనేయులు, కొల్లా కొండలరాయుడు, మునంగి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వర్షాభావం..



నాలుగేళ్ల తర్వాత వర్షాభావం వెంటాడుతోంది. మళ్లీ కరువు అనే మాటలు వినక తప్పడం లేదు. వర్షాలు సకాలంలో కురవనందున ఖరీఫ్ దాదాపుగా చేజారింది. ఈ ఏడాది కేవలం 6 శాతమే ఖరీఫ్ సాగు జరిగింది. అదును దాటింది. వర్షాల జాడ లేదు. ఎండలు మండుతున్నాయి. వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. పంటల సాగు ప్రశ్నార్ధకంగా మారింది. ఇప్పటి వరకూ వర్షపాతం చూస్తే లోటులోనే ఉన్నాం. చాలా పంటలకు అదును దాటింది. 4.20 లక్షల ఎకరాలకు గానూ ఇప్పటివరకూ కేవలం 33 వేల ఎకరాల్లోనే వివిధ పంటలు స్వల్పంగా సాగయ్యాయి. ఇవి కూడా ఎండుతున్నాయి. జూన్, జూలై నెలల్లో తగిన స్థాయిలో వర్షం కురవలేదు. చాలా మండలాల్లో భూములు దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. విత్తనాలు పడే పరిస్థితి కనిపించడం లేదు. ఆగస్టు నెలాఖరుకు వాస్తవంగా ఖరీఫ్ గడువు ముగుస్తుంది. అయితే వర్షాలు ఆశాజనకంగా లేనందున సాగు లేదు. గతేడాది ఇదే సమయానికి లక్ష ఎకరాలకు పైగా సాగు జరిగింది. ఈ ఏడాదే ఆందోళనగా ఉంది. కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయి. తాగునీటి ఎద్దడీ తీరలేదు. భూగర్జజలాలు అడుగంటుతున్నాయి. సాగర్ జలాలను విడుదల చేశారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంది. రబీలోనే వరిసాగు జరిగేది. ఏదేమైనా ఈ ఏడాది ఖరీఫ్ పంటలను కోల్పోయినట్లేనని స్పష్టమవుతోంది. రైతులకు ఈ పంటల నుంచి సుమారు రూ.1500 కోట్లకు పైగానే ఏదో రూపంలో ఆదాయం వస్తుందని అంచనా. ఇప్పుడు ఇదంతా చేజారినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రాజకీయపార్టీల అడుగులు అన్నీ ఎన్నికల దిశగానే పడుతున్నాయి. ఏ కార్యక్రమం పెట్టినా అందులో ఎన్నికల మైలేజీ కోసమే తపిస్తున్నారు. ఎవరి వ్యూహాల్లో వాళ్లున్నారు. సంక్షేమ పథకాలకు ఖాతాల్లో నగదు వేయడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. నిర్లక్ష్యానికి గురైన రంగాలను ఎంచుకొని ప్రతిపక్షాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఇటీవలే జిల్లాలో లోకేష్ పాద యాత్ర ముగిసింది. తెలుగుదేశంలో బాగా ఉత్సాహం కనిపించింది. పార్టీ శ్రేణులు కదిలాయి. ఈ వారంలోనే తెలుగుదేశం అధినేత చంద్రబాబు యుద్ధభేరి పేరుతో గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. రైతుసంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో భేటీలు జరిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ప్రాజెక్టులపై ఆయన తన భవిష్యత్ ఆలోచనలను వెల్లడించారు. నదుల అనుసంధానం అనే అంశాన్ని స్పష్టంగా వివరించారు. నిర్వాసితుల సమస్యలను నేతలు విన్నపించారు. అధికారంలోకి వచ్చాక జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యతను తీసుకుంటామని చంద్రబాబు హామీలు ఇవ్వడం విశేషం. చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు ప్రాజెక్టుల గురించి ఏం చేశారని వైసిపి నేతలు ప్రశ్నిస్తున్నారు.

బాపట్ల జిల్లాలో రాజకీయ ఘర్షణలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా చీరాల నియోజకవర్గంలో పాలకపక్షంలోనే రెండు వర్గాలు పంచాయతీ వార్డు ఎన్నికల సందర్భంగా ఘర్షణలకు దిగాయి. ఈ గొడవలకు వేటపాలెం మండలం వేదికగా మారింది. ఎమ్మెల్యే కరణం వర్గం – మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గాల నడుమ రెండ్రోజుల క్రితం రణరంగమే జరిగింది. రాళ్ళు రువ్వుకోవడాలు జరిగాయి. ఓ మహిళా కానిస్టేబుల్ తలకు రాయి తగిలి తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసులు రాజకీయ ఘర్షణలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణం. పాలకపక్ష నేతలు కావడంతో వదిలేస్తున్నారు. ఇవే అక్కడ శాంతిభద్రతల సమస్యకూ కారణంగా మారుతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లో పాలక, ప్రతిపక్ష పార్టీల నడుమ ఏదైనా జరుగుతుంటాయి. ఇక్కడ మాత్రం వైసిపిలోనే ఇరువర్గాల నడుమ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. కారణం ఇక్కడ అధికారం.. రాజకీయ పైచేయి కోసం సాగే వ్యూహప్రతివ్యూహాలేనని చెప్పక తప్పదు.

గడపగడపకూ మళ్లీ మొదలుపెట్టారు. పాలకపక్ష ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జిలు ఇటీవల ఈ కార్యక్రమాన్ని చాలావరకూ నిలిపేశారు. ఎమ్మెల్యేలు ఇప్పుడు మళ్లీ గ్రామాల్లోకి వెళుతున్నారు. ఎందుకంటే 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిగా విడుదల చేశారు. కరెంటు బిల్లులకు కొంతపోను మిగతా నిధులు అభివృద్ధి పనుల కోసం వెచ్చించాలని సూచించారు. దీంతో బిల్లులు వస్తున్నాయి. ఎమ్మెల్యేలకు గ్రామాల్లో తిరిగే అవకాశం వచ్చింది. అయితే ఎమ్మెల్యేలకు గ్రామాల్లో ప్రతిఘటనలు తప్పడం లేదు. జనం ఏదో సమస్యతో నిలదీస్తున్నారు. గట్టిగానే అడుగుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పొచ్చు. చూసీచూసీ విసుగెత్తి ఇప్పుడు నిలదీస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా పట్టణంలో గడపగడపకూ ప్రారంభించారు. కొద్దిరోజులుగా జిల్లాకు దూరంగా ఉన్న ఆయన శుక్రవారం నాడు ఒంగోలు వచ్చారు.

పోలిరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-బాపట్ల

కోరిశపాడు మండలంలోని ఎర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను ప్రాజెక్టు పరిధిలోని రైతులు కోరారు. శుక్రవారం బాపట్లలోని కలెక్టర్ కార్యాలయంలో శాసనమండలి సభ్యుడు కెఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, రైతులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రైతుల ఆకాంక్ష మేరకు 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి రూ.177 కోట్ల అంచనాలతో ఎర్రం చిన్న పోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల ప్రాజెక్టును డిజైన్ చేయించాడని చెప్పారు. 24 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని మై టాస్, కె. సి .సి. పి.ఎల్. అనే సంస్థలకు రూ.138 కోట్లకు 2008లో కాంట్రాక్ట్ ఇచ్చారని తెలిపారు. 2010 జూన్ 5వ తేదీ నాటికి ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి కావలసి ఉన్నా.. ఇంతవరకు ప్రాజెక్టు నిర్మాణం 60 శాతం మించి జరగలేదని లక్ష్మణరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల కోరిశపాడు మండలంలోని ఎనిమిది గ్రామాలకు, ప్రస్తుత ప్రకాశం జిల్లాలో గల నాగులుప్పలపాడు మండలంలోని ఐదు గ్రామాలకు కలిపి, మొత్తం 20 వేల ఎకరాలకు సాగునీరు, 13 గ్రామాలకు తాగునీరు అందించే అవకాశం ఉందని



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చెప్పారు. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు రూ.85 కోట్లు ఖర్చు చేసి, 60 శాతం పనులు మాత్రమే పూర్తిచేశారని వివరించారు. మండలంలోని తమ్మవరం నుండి కోరిశపాడు రిజర్వాయర్‌కు 11 కిలోమీటర్ల పైపులైను, లిఫ్ట్ మోటర్లు పనులు పూర్తయ్యాయని, ట్రైల్ రన్ కూడా వేసి పరీక్షించటం జరిగిందని చెప్పారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ కోరిశపాడు రిజర్వాయర్ పని 67 శాతం పూర్తయిందని, బొల్లవరప్పాడు రిజర్వాయర్ పనులు ఇంతవరకు మొదలు కాలేదని చెప్పారు. ఈ రెండు రిజర్వాయర్ల మధ్య ఎనిమిది కిలోమీటర్ల కాలువకు గాను, 6.5 కిలోమీటర్లు మాత్రమే పూర్తయిందని, ఇంకా 1.5 కిలోమీటర్ల కాలువ తవ్వకాలు జరగాలని చెప్పారు. సిమెంట్ నిర్మాణ పనులు 28 జరగాల్సి ఉండగా, ఇప్పటికీ 15 పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. బొల్లవరప్పాడు రిజర్వాయర్‌కు, కాలువలకు సుమారు 540 ఎకరాలు తీసుకోవాల్సి ఉండగా, ఇంతవరకు అడుగు ముందుకు పడలేదన్నారు. కోరిశపాడులోని తూర్పు పాలెంకు పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని రామారావు చెప్పారు. సుమారు 10 ఏళ్ల నుండి పనులు ఆగిపోవడం వల్ల ఇప్పటివరకు చేసిన పనులు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. మిషన్లు తుప్పుబడుతున్నాయని, కాలువలు పూడిపోతున్నాయని అన్నారు. రిజర్వాయర్ కట్లపై కంప చెట్లు మలిచి కట్టలు బలహీనపడుతున్నాయని చెప్పారు. ప్రాజెక్టు పనులకు ఖర్చు చేసిన 85 కోట్ల రూపాయలు బూడిదలో పోసినట్లవుతుందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వల్ల ఈ ప్రాంతంలో పనులు లేక వ్యవసాయ కూలీలు వలసపోతున్నారని రైతులు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి, అడ్డంకులు తొలగించి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా కషి చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రాజెక్టు పరిస్థితిపై ప్రభుత్వానికి తెలియజేస్తానని, ప్రాజెక్టుకు అవసరమైన నిధులు రాబట్టేందుకు ప్రభుత్వంతో చర్చిస్తానని కలెక్టర్ రంజిత్‌బాషా రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు కొల్లా సుబ్బారావు, అనుబ్రోలు ప్రభాకర్‌రావు, బొంతు పూర్ణచంద్రరావు, పూనాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శివారు కాలనీలలో వసతుల కల్పనకు కృషి

మాజీ మంత్రి బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని శివారు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగం గా శనివారం ఆయన ఐదో డివిజన్ పరిధి లోని భగత్‌సింగ్ కాలనీలో పర్యటించారు. ఆ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాలనీకి రోడ్డు వసతి ఏర్పాటు చేయాలని, మురుగు కాల్వలు నిర్మించాలని స్థాని కులు బాలినేని శ్రీనివాసరెడ్డిని కోరారు. దీనిపై బాలినేని స్పందిస్తూ ప్రస్తుతం పోతురాజు కాలువ ఆధునీకరణ పనులు పూర్తి అయిన తరువాత భగత్ సింగ్ కాలనీ వాసులకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొ రేటర్ పద్మావతి పాల్గొన్నారు.